

# అమ్మ కూచి హీరో

కొండేపూడి నిర్మల

**'అమ్మా హీరో వచ్చాడు' ఎగురుకుంటూ వచ్చి చెప్పింది ఎనిమిదేళ్ళ నాకూతురు శైలూ. ఆఖరివాయి గారెలు వేయిస్తున్నదాన్నల్లా చటుక్కున పక్క స్టవ్వుమీద టీ నీళ్లు పడేసి 'కళ్యాణీ' అంటూ మా ఆడపడుచును కేకేశాను.**

కూనిరాగం తీస్తూ సింకు దగ్గర చేతులు కడుక్కుంటున్న కళ్యాణి కాస్త ఆ సబ్బు మొహానికి పట్టించేసి రెండు దోసిళ్లు నీళ్ళు చల్లుకుని అదరాబదరా అద్దం ముందుకు పరిగెత్తి పౌడరు పట్టించింది నడినెత్తికున్న కొప్పు ఊడదీసి షోగ్గా శాటిన్ రిబ్బన్ చుట్టి వదిలేసింది నుదిటిమీదికి చెవులముందుకు నాలుగైదు పాయలు మెలిబట్టి వేలాడదీసింది. రెండేరెండు చిటికెల్లో ఎంతందంగా ముస్తాబవడానికి సాధ్యమవుతుందో అంతందంగానూ తయారైపోయి పేపరు తిరగేస్తున్నట్టు కూచుండిపోయింది. ఈ లోగా కుకూ కుకూ అంటూ కాలింగ్‌బెల్ మోగడంలో శైలూ తలుపుతియ్యడమూ పూర్తయ్యాయి లాగుంది. వరండాలోంచి హాల్లో కొస్తూ బూట్లచప్పుడు దగ్గరైంది.

ఒకపెద్ద ప్లేటునిండా గారెలూ అల్లప్పచ్చడీ, ఫ్లాస్కునిండా టీ పోసుకుని నేనూ అక్కడికి చేరాను.

అప్పటికే మావారు పిల్లలూ కళ్యాణీ అతనికెదురుగ్గా కుర్చీల్లో కిటకిట్లాడుతున్నారు.

హీరో వస్తే మీకందరికీ బలే హుషారుగా కొత్తరక్తం పట్టినట్లు వుంటుంది. అతని చూపూ, మాటా, నడకా, నవ్వు ఒక్కొక్కటీ ఒక్కో హీరోని గుర్తు తెస్తాయి. అచ్చం సినిమాల్లో లాగానే కొత్త కొత్త మానరిజమ్స్ చూపిస్తూ ఎవ్వర్‌గ్రీన్‌గా కూడా వుంటాడు.

బూటు మడమమీద అగ్గిపుల్లగీసి వెలిగించడం, చేత్తో ఎగరేసి నోటితో సిగరెట్టందుకోడాలూ, మూడేసి మెట్లుచొప్పున మేడ ఎక్కేసి దిగడమూ, రెండు చేతుల్తోనూ పట్టుకుని హటాత్తుగా వేలుకున్న ఉంగరం మాయజేయ్యడమూ పావుగంట క్రితం కాల్చిన సిగరెట్టుకి ఇప్పుడు పొగ తెప్పించడమూ, కొవ్వొత్తి కాంతిలో వేళ్ళు కదిలిస్తూ గోడమీద రకరకాల నీడలు సాగించడమూ చూడాలేగానీ చెప్పనలవికాదు. అంచేత అతనొచ్చినంత సేపూ మా యిల్లు నవ్వుల్తో దద్దరిల్లిపోతూ వుంటుంది. అంతేకాదు కర్ఫ్యూటైమ్‌లో ఫూట్ ఎట్ ది సైట్ రోజున సైతం తనెంత స్పీడుగా టాంక్‌బాండ్‌రోడ్ క్రాస్ చేసిందీ, నెల్లతరబడి తమ కరెంట్ పక్కవాని మీటరు కెలా కలుస్తున్నదీ, ఊరంతా నీళ్ళులేక అవస్థపడుతుంటే తమ వంటింట్లో పంపు ఎలా వస్తోందీ, హైస్కూల్లో వున్నప్పుడే తనకెంత గూండాల్తో పరిచయం వున్నదీ, డిగ్రీ పేపర్లు జిల్లాలవారిగా ఎలా అవుట్ చేసిందీ క్రిందటేడు పోలింగులో దొంగ ఓట్లెలా వేయించిందీ చెబుతుంటే నోరు తెరుచుకుని వింటూ వింటూ ఆ కళ్ళతో మావంక చూసుకుంటే ఉత్త చవటదద్దమ్మల్లా వుంటాం. ఎందుకంటే నాలుక్కిలోల పంచదార కార్డుమీద రెండు కిలోలే యిచ్చి 'స్టాకులేదు పోవమ్మా' అనగానే పోయేనేమూ, ఎమ్మెస్సీ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యి తను అటెండ్ అవాల్సిన ఇంటర్వ్యూ బోర్డులో సొంత మేనమామ వున్నందున ఒకవేళ సెలక్టయితే అది ఆయన పుణ్యమే అని నలుగురూ అనుకుంటారని బిడియపడి మానేసిన మా వారికీ హీరోలాంటి వాడితో చుట్టరికం కలవడం థ్రిల్లింగుల్లో కెల్లా థ్రిల్లింగ్గా వుంది.

అలాంటి థ్రిల్లు మూడ్‌లోనే నాకొచ్చిన ఓ కొత్త కష్టాన్ని హీరో ముందుంచాలని పొద్దుట్నించీ చూస్తున్నాన్నేను. 'హోహో... హో... హో' గబ్బర్‌సింగ్ నవ్వును అభినయిస్తున్నాడు హీరో.

పిల్లలూ కళ్యాణీ నవ్వలేక ఆయాసపడుతున్నారు.

ప్చ్ ఇప్పుడేం అడగొద్దు బోధింపుడు కళ్ళతోనే వారిస్తున్నారు మా వారు నన్ను.

ఇదింకా బావుంది. అడక్కపోతే ఎల్లాగా. గట్టిగా వారంలేదు మా తమ్ముడి పెళ్ళి ఇప్పుడైనా వెళ్ళొద్దా. పురిటి హడావిడీ దాటిందికదా. మీ చెల్లాయినీ పసిపిల్లనీ నాల్రోజులపాటు వూళ్ళోవున్న వాళ్ళ అత్తారింటికి పంపిస్తే కొంపలంటుకుంటాయా? వస్తూనే తోలుకు తెచ్చుకుంటాం కదా కళ్ళతోనే జవాబిచ్చాను నేను.

'బ్బె బ్బె బ్బే మూడో నెల్లోపల చలిమిడి లేకుండా పంపరాదు. చలిమిడి పెడితే నెల్లోపల మళ్ళీ పుట్టింటి గడప తొక్కరాదు' అంటూ ఓ జోశ్యాన్ని కొనుక్కొచ్చారు మా వారు పాతిక రూపాయిలిచ్చి. అదేదో సామెతలా వుంది నా ప్రాణానికి. నాకీ పద్ధతులంటేనే చీదర. ఈ మనుషులంతా పద్దతులు పద్ధతులుగా, మర్యాదలందుకుంటూ చేయించుకునే బొమ్మలుగా తప్పనిసరి తనాల్తో చచ్చిపోడం మానేసి




CHAITANYA

సహజంగా సుఖంగా సౌకర్యంగా ఎవరి కష్ట సుఖాలు వాళ్ళర్థంచేసుకుంటూ ఎప్పట్నించి బతుకుతారా అని ఎదురుచూపు నాకు.

ఇన్నేసి గిమ్మిక్కులతో గలగలా నవ్వించే హీరో నా బాధని ఎడంచేత్తో తీసిపారేస్తాడని నమ్మకం వుంది. హీరో అంటే హీరోయే కనక వీరోచితంగా వ్యవహరించడా మరి!

వస్తానింక అన్నాడు హీరో టైమ్ చూసుకుంటూ.

'ఆగండాగండి' అంటూ వెడ్డింగ్ కార్డ్ అతని చేతిలో పెట్టాను.

'వారంలోనేనా భలేపనిపడిందే పెళ్ళిళ్ళ సీజన్ కదక్కయ్యగారూ. అయినా ఫర్లేదు వర్రీ అవకండి. ఎలాగోలా మేనేజ్ చేస్తాను. రిజర్వేషనేగా. నిశ్చింత గా వుండండన్నాడు.

కొండెక్కినంత సంబరంగా వుంది నాకు.

'కళ్యాణి ఒక్కతే వుంటుందని వర్రీగా వుంది' అన్నాను ఏమంటాడోనని.

ఒక్కతే ఎందుకు మా యింటికొస్తుందనో ఏదో అంటాడని అసలామాట అనకుండా ఏ మొగుడైనా ఎలా వుంటాడనేది నా ధీమా.

'అమ్మనడక్కపోయారా' అన్నాడు.

ఖంగుతిన్నాను. ఇలాంటి విషయాలు అర్థం చేసుకుని సహకరించే శక్తి ఆవిడకి నచ్చజెప్పే చనువు నాకు లేవు కదండీ! అన్నాను కొంచెం నిష్ఠూరంగా పెళ్ళిలో జరిగిన గొడవలు గుర్తుచేసుకుంటూ

నాకేం సంబంధం లేదు అన్నట్టు కూచున్నాడు కాసేపు వీక్లీ తిరగేస్తూ. 'నేనిలాంటి చిన్న చిన్న విషయాలు పట్టించుకోను' అన్నాడు అమితాబ్‌లా తలెగరేసి.


'మా తమ్ముడి పెళ్ళికెళ్ళడం నాకు చాలా పెద్ద విషయమే బాబూ. ఏదో ఒక సలహా చెప్ప ప్లీజ్. పోనీ నాల్రోజులు పాటు మీరే మా యింట్లో వుండరాదూ కళ్యాణికి తోడుగా... చిలకా గోరింకల్లాగా...' ఊరించాను.

'చాల్లే. వదినా ఇంటల్లుడ్ని కాపలా వుండమందామా' కలగ జేసుకుంది కళ్యాణి.

చెంప పగలకొట్టాలనిపించింది.

'వుండచ్చునుకో. అబ్బే అందుక్కాదు. నాకు సవాలక్షపన్లున్నాయి' అన్నాడు హీరో

బావమరిదీ అతని భార్యా వూరెడుతుంటే బాలింతరాలైన తన పెళ్ళాన్ని ఎక్కడుంచాలనే సమస్య అతని సవాలక్షపన్లలిస్టులోకి ఎలా చేరలేదో తేరుకోలేని ఆశ్చర్యం నాకు 'అమ్మో భలే వారే మీకెల్లా కుదుర్తుందండీ. మీ అక్కయ్య మాటలు పట్టించుకోకండి. అంతగా అయితే మా ఇంకో తమ్ముడి ఫామ్లీని' పిలిపిస్తాను టెలిగ్రామిచ్చి' అన్నారు మా వారు నా వంక క్రూరంగాచూస్తూ నాతలకాయ తీసుకెళ్ళి ఆయన తలకాయకేసి పగుల కొట్టుకుంటే ఎవరిది ఓటి బుర్రో తెలుస్తుందా తెలీదాని సందేహం వచ్చింది. జగ్గులోవున్న టీ నీళ్ళు మొహానపోసి హీరో హీరో గబ్బర్ సింగ్‌లా నవ్వు మళ్ళీ అనడగాలనిపించింది. ఏపనీ చెయ్యలేదు నిస్సహాయంగా చూస్తు కూచున్నాను. ఉయ్యాల్లో పిల్ల ఉలిక్కిపడి లేచి ఏడవడం మొదలెట్టింది. 'మీ పాపకి




రాక్షసి అని పేరెట్టండంకుల్' అంటోంది నా కూతురు.

'నీ పోలికే అన్నమాట....' నవ్వుతున్నాడు హీరో జితేంద్ర ఫక్కీలో 'పేరేమిటో చెప్పారుకాదు ఎన్నాళ్ళు మీరీ సస్పెన్సు' అదే అందరి జీవన్మరణ సమస్యా అయినట్టు నంగి నంగి గా మావారు. 'అమ్మనడగాలి' అన్నాడు మళ్ళీ.

'పాపను చూడాలనిపించడంలేదూ. అచ్చం మీ పోలికే తెలుసా ఎంతల్లర్లో ఓర్చాయనో' గారంగా ఊరింపుగా అంది కళ్యాణి. 'నక్షత్రం లేదూ గిక్షత్రం లేదూ చూడవోయ్. నీ కూతుర్ని మధ్య చూడ్డానికి గ్రహాలు అడ్డం పడ్డమేమిటో' అన్నాను అతనికి సపోర్టిస్తున్నాననుకుని.

'ఆగదల్చుకుంటే ఆగుతానండీ ఏడాదైనా సరే అదే మన గొప్ప ఏమనుకున్నావ్ మరి! పెళ్ళాం దగ్గర దర్పం ఒలకబోశాడు' హీరో ఎబ్బెట్టుగా అనిపించింది నాకెందుకో.

'మీ పెద్ద వదిన ఒంట్లో ఎలా వుంది ప్పుడు?' అనడిగాను అయిదోనెల్లో అబార్షన యింది ఆ పిల్లకి, కిందనుంచి మేడమీదికి నీళ్ళు మోసుకొస్తుంటే జారిపడి-

ఫర్లేదనుకుంటా అన్నట్టు భుజాలెగరేశాడు.

'ఇప్పటికైనా పుట్టింటికి పంపారా మీ అమ్మగారు' అన్నాను సాధ్యమైనంత శాతంగా

'కొశ్చన్లేదు' అన్నాడు ధృడంగా

తెల్లబోయాను.

'మీకు తెలీదక్కా మా అన్నయ్యని ఇల్లరికం చేసుకోవాలని నానా ప్రయత్నాలూ చేసాడు వాళ్ళనాన్న. వదిన మటుక్కూ తక్కువతిందా. వేరుకాపరం కుదరట్లేదని బదిలీ ప్రయత్నాలు చేయించింది. ఏనుగు దగ్గరా కుప్పిగంతులు? సమయానికి అడ్డుపడ్డాం. వారం రోజులు హోరాహోరీ వాళ్ళ మేనేజ్‌మెంటుతో ఫైట్‌చేసి కాన్సిల్ చేయించాం అంటూ లేచాడు హెల్మెట్ తలమీదుంచుకుని 'మామయ్యా డ్రాకులా ఎల్లా నడుస్తాడో చెప్పవా?' నాలుగేళ్ళ నా కొడుకు చెయిలాగుతూ అడిగాడు హీరోని

'ఇప్పుడా... సరే. డ్రాకులా వేషానికి లైట్లార్పెయ్యాల్రా.... అన్నీ' అన్నాడు.

ఆర్పేశాం.

నాలుకసాగదీసి, కంటిరెప్పలు వెనక్కి విరిచి, టార్చిలైటు గడ్డం కింద ఫోకస్ చేస్తూ భయం గొలిపేలా నడుస్తూ వస్తున్నాడు.

'హమ్మయ్యో' కళ్ళు పెద్దవిచేసి ఉత్కంఠగా చూస్తున్నారు పిల్లలు. నాకెందుకో ఆహీరో కి యిచ్చిన బొమ్మలాగా, పిల్లిలాగా, ఎలకలాగా దోమలాగా పేడపురుగులాగా దయనీయంగా కనిపిస్తున్నాడు.

'అన్నిటికీ అమ్మనడగాలి అమ్మనడగాలి అంటాడేమిటండీ మీ అమ్మకూచి హీరో' అన్నాను విసుగ్గా రాత్రి భోజనాల దగ్గర.

'ఏమిటనుకున్నావ్ మరి మగవాళ్ళని ఆడిపోసుకుంటావ్ కదా మేమెంత పరాధీనులమో చూశావా. ఆడదానికి ఆడదే శత్రువు' తేల్చారు మావారు ఎప్పట్లాంటి తన ధోరణిలో

'ఆడదానికి ఆడది శత్రువెందుకవుతుందో తెలుసా. జస్ట్ అభద్రత! తన భర్త, కొడుకు, అన్నల ఏకాగ్రత ఇంకో ఆడది దక్కించుకుంటుందనే భయం' దాని వల్ల తన విలువపోతుందని వర్రీ. యాచకో యాచక శత్రు అనేమాట విన్లేదూ. ఆడదెప్పుడూ అంత దయనీయమైన పరిస్థితులోనూ వుంటుంది. పెళ్ళయి కాపురానికి వచ్చినపుడు అందం మంచితనం లాంటి లక్షణాలతో వంటింటి ప్రవేశం చేసి మొదటి ఇంట్లో వాళ్ళ రుచులూ అభిరుచులూ తృప్తి పరచడం మొదలెడుతుంది. ఎదిగే పిల్లలూ, తరువాత ఓపికా, చాకిరీ, వీటివల్ల భర్తతో ఒక కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడిందని తెలుసుకుని లైంగికమైన అశాంతి కూడా తోడు కాగా ఆస్తులు చదువులు లాంటి కొంచెం పెద్ద విషయాలు నెత్తిన పెట్టుకుంటుంది. దానితో మరిన్ని హక్కులు పొందాననుకుని భ్రమపడుతుంది. అదిగో అలాంటప్పుడు కోడలు అనబడు ఇంకో ఆడది తనకంటే అందంతో తెలివితో ఇంటికొస్తుంది. సహజంగానే ఇంట్లోవాళ్ళ ఏకాగ్రత అటుమళ్ళుతుంది. ఈ సైకిల్ మళ్ళీ పునరావృతమౌతుందని తెలుసు కనక తను నిరాధారమైపోతున్నట్టూ వార్ధక్యంతో పీడించబడుతున్నట్టూ సవాలక్ష భయాలకు లోనై పోలీసింగ్ మొదలెడుతుంది. అడదానికి వున్న ఇన్ని దశల్లోనూ మగవాడికి స్థానచలనంకానీ, తిండి భద్రతా పరువూ లాంటి విషయాలకుగానీ ఏలోపంరాదు. ఆడవాళ్ళనిలా అత్తలుగా, కోడళ్ళుగా, వదినలుగా ఆడబిడ్డలుగా విభజించి పాలించే మగవాడు తెలివైన పాలకుడు. పీడితులైన ఆడవాళ్ళంతా కొత్త ఖైదీని ఏడిపించే పాతఖైదీలాంటిగెలుపుల్లో మునిగి తేలుతూ వుంటారు. కాబట్టే ఆడాళ్ళకి సంబంధించిన కష్టాలెవరైనా ఎకరువు పెట్టగానే ఇలాంటి చిన్న చిన్న విషయాలు నేనేం పట్టించుకోను అంటాడు మగాడు, మన హీరో లాగే.

'శాంతి శాంతి' అన్నారు మా వారు హాస్యంగా

'నో. యుద్ధం తరవాతే శాంతి వస్తుంది. నేను మా తమ్ముడి పెళ్ళికెడతాను. మీరు మీ అమ్మకూచి హీరో నాల్రోజులు సెలవు పెట్టి కళ్యాణికి కంపెనీయివ్వండి మరేం ఫర్లేదు. అంతకంటే మునిగిపోయే పన్లేమీ మీకు లేవని నాకు తెలుసు. ఈ రాత్రికిదే నా పరిష్కారం' అంటూ మంచం దిగి గబగబా నా బట్టలూ పిల్లల బట్టలూ సూట్కేసులో సర్దడం మొదలెట్టాను.

"ఇ.టి. స్టీవెన్ స్పీల్ బెర్గ్"

